

# నీవు వచ్చేవనీ...నీ పిలుపేవిని

– విజయరాణి కోడూరి

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల

(గత సంచిక తరువాయి)

"అలా అనిపిస్తుందా?" అన్నాడు నవ్వేస్తూ.

"జస్ట్ అలా అనిపించింది. అనేశాను" అంది.

"మీరు తెలుగు అమ్మాయి అని చూడగానే చెప్పేయొచ్చు" అన్నాడు.

"ఎలా?" అంది లత.

"ఏమో, అలా అనిపించింది. అనేశాను" అన్నాడు నవ్వుతూ.

చిన్నగా నవ్వింది లత అతడి అనుకరణకు.

"నాకు డ్రెస్‌ల కన్నా చీరలు అంటేనే ఇష్టం."

"అయితే బైక్‌కు శారీగార్డ్ వేయించవలసిందే" అన్నాడు.

ఉలిక్కిపడి అతడి ముఖంలోకి చూసింది లత.

గమనించిన హేమంత్ నవ్వేశాడు, "అనిపించింది నాకు, అనేశాను" అంటూ.

హాస్టల్ దగ్గర దిగిన లత, "థాంక్యూ హేమంత్‌గారూ" అని చెప్పి లోపలకు వెళ్ళిపోయింది. వెంటనే మళ్ళీ వెనకు వచ్చింది లత.

"హేమంత్, మీకు ఇష్టమైనది ఒకటి నా దగ్గర ఉండిపోయింది." అంటూ బ్యాగ్‌లో వెతికి వేఫర్ ప్యాకెట్ తీసి ఇచ్చింది అతడికి.

"నాకు ఇష్టమైనది నా మనసులోనే వుంది" అన్నాడు అప్రయత్నంగా.

"మీరు అర్థంకారు నాకు" అంది. "బై" అని చెప్పి వెళ్ళిపోయింది తిరుగు ముఖం పట్టిన హేమంత్‌కు మనసులో వెలితిగా అనిపించింది.

మరుసటి రోజు కాలేజ్ టైం అయిపోయాక, పార్కింగ్ పక్కన ఉన్న చెట్టు క్రింద నిలబడి ఎదురు చూస్తున్న లత, ఒక కారు రాష్‌గా వచ్చి దగ్గర ఆగేసరికి కంగారుగా రెండు అడుగులు వెనక్కు వేసింది.

"కమాన్ లతా" అంటూ లెఫ్ట్ డోర్ ఓపెన్ చేశాడు సురేష్.

"సురేష్ నేను డ్రాప్ చేస్తా రా" అన్నాడు.

"ప్లీజ్ సురేష్, నాకు కొంచెం పని వుంది. మీరు వెళ్ళండి" అంది.

"హేమంత్ కోసమా?"

"అవును" అంది మరోవైపు చూస్తూ.

"ఆ పనేదో మాకు చెపితే చేస్తాంగా. మాకు కూడా కాస్త ఛాన్స్ ఇచ్చి చూడరాదా?" వ్యంగ్యం తొంగి చూస్తుంది అతడి మాటలలో.

"ప్లీజ్ అలా మాట్లాడకండి నాతో. నేను బుక్స్ కోసం ఆగాను. మీరు వెళ్ళొచ్చు" అంటూ కాలేజ్ గేటు వైపు చూపింది.

"నీకు బైకే నచ్చుతుందిలే. అప్పుడపుడు కారు కూడా ఎక్కు" అంటూ డోర్ శబ్దం వచ్చేలా వేసుకుని వేగంగా వెళ్ళిపోయాడు.

లత మూడ్ ఆఫ్ అయింది. "ఇడియట్" అంటూ కళ్ళు మూసుకుంది ఒక్క క్షణం.

"ఏంటీ నిలబడే నిద్రపోతున్నారా?" ఉలిక్కిపడి చూసింది లత. హేమంత్‌ను చూసి చిన్నగా నవ్వింది.

"లేదు మీ కోసమే చూస్తున్నా" అంటూ.

"నాకోసమా, బుక్స్ కోసమా?" చిలిపిగా అడిగాడు హేమంత్.

"బుక్స్ కావాలంటే మీ కోసమే చూడాలిగా" అంది.

"సరదాగా అడిగాను గాని, మీ బుక్స్ బైక్ బ్యాగ్‌లో ఉన్నాయి."

"మరి ఇవ్వండి హేమంత్" అంది అతడి ముఖంలోకి చూస్తూ.

"అవి చాలా వెయిట్ ఉంటాయి లతా.." సంశయంగా అన్నాడతడు.

"తప్పదుగా ఇవ్వండి. కావాలంటే మొయ్యవలసిందేగా" అంది నవ్వుతూ.

"నా ఉద్దేశం కూడా అదే" అన్నాడు అప్రయత్నంగా.

తడబడ్డాడు హేమంత్. "మీరు మోసే పని లేకుండా చిన్న సజెషన్. జస్ట్ సజెషన్ మాత్రమే" అన్నాడు.

"మీ మాటలు నాకు అర్థంకావు. చెప్పండి" అంది.

"మీరు నాతో వచ్చి, మీ హాస్టల్ దగ్గర దిగిపోతే బుక్స్ మోత వుండదు మీకు. చెప్పానుగా, ఏజ్ యు ప్లీజ్."

ఒక్క క్షణం అతడి ముఖంలోకి చూసి, "సరే " అంది లత.

"రండి" అంటూ ముందుకు జరిగాడు హేమంత్.

"అవి ఇలా ఇవ్వండి" అంటూ చెయ్యి చాపాడు.

హ్యాండ్ బ్యాగ్, కోటు అతడికి ఇచ్చేసింది.

"సరిగ్గా కూర్చోండి మేడం" అంటూ బైక్‌ను ముందుకు పోనిచ్చాడు హేమంత్. కాసేపు మౌనంగానే ఉన్నారు.

"ఈ రోజేం షాపింగ్ లేదా?" అడిగాడు హేమంత్.

"ఊహూ లేదు" అంది లత.

"నాకోసం ఫైవ్ మినిట్స్ స్పేర్ చెయ్యగలరా?"

"అయ్యో ఎందుకు చెయ్యను? వెళ్ళి రండి" అంది దిగి నిలబడుతూ.

బైక్ ఆపి దిగాడు హేమంత్.

"వచ్చి కొంచెం సాయం చెయ్యొచ్చుగా?" అన్నాడు ఆమె ముఖంలోకి చూస్తూ.

"ఎలా?" అంది అర్థం కానట్టు.

"ఈ రోజు ఫ్రెండ్‌షిప్ డే. చిన్న సెలెక్షన్‌కు హెల్ప్ చెయ్యాలి. నా ఫ్రెండ్ కోసం తీసుకోవాలి" అన్నాడతడు.

"అవునా పదండి" అతడి వెంట షాప్‌లోకి వెళ్ళింది లత.

"ఇదేంటి  ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కోసం  జ్యులరీ షాప్‌లోకి వచ్చారు?" అడిగింది అతడిని.

"ఏ బ్యాండ్ లేకున్నా అల్లుకుపోయేదే స్నేహబంధం లతా."

"మీ మాటలు నాకు అర్థంకావు సుమా" అంది షోకేస్‌లలోని జ్యుయలరీ ఐటం చూస్తూ.

షాప్ అతడు ఒక బాక్స్ తెచ్చి తెరిచాడు "ఇది చూడండి" అన్నాడు.

"లతా, ఇది బాగుంది కదూ" అన్నాడూ హేమంత్.

"ఇది ముత్యాల బ్రేస్‌లెట్ కదా, జెంట్స్‌కు అసలు సూట్ కాదు" అంది లత.

"ముత్యమంత స్వచ్ఛమైన నా ఫ్రెండ్ కోసం" అన్నాడు ఆమె కళ్ళలోకి చూస్తూ చూపును మరల్చుకుంది లత.

"చెప్పానుగా, మీరు అర్థం కారు నాకు. మీకు నచ్చితే తీసుకోండి."

షాప్ అతడు దానిని ప్యాక్ చేస్తుంటే "వద్దు ఇలా ఇచ్చేయండి. అంటూ షర్ట్ పాకెట్‌లో వేసుకున్నాడు హేమంత్.

బిల్లు, కౌంటర్ మీదనుంచి జారి క్రిందపడిపోతే తీసి ఇస్తూ చూసిన లత 'పన్నెండు వేలా?' అనుకుంది.

షాప్ బయటకు వచ్చారు. బైక్ దగ్గరకు నడుస్తూ "లతా ఏమైనా చల్లగా తీసుకుందామా?" అడిగాడు హేమంత్. ఒకసారి అతడి ముఖంలోకి చూసి, వాచ్ వైపు చూసుకుంది లత.

"సరే" అంది.

"ఐస్క్రీం, కూల్ డ్రింక్.. ఏది?" అడిగాడు హేమంత్ మెనూ చూస్తూ.

నవ్వేసింది, "మీరు.." మధ్యలోనే అడ్డువచ్చాడు హేమంత్.

"నేను అర్ధంకాను. అదేనా అమ్మాయిగారు చెప్పేది?"

"అదేం కాదు. మీరు ఏదో ఒకటి ఆర్డర్ చెయ్యండి అని."

"అయితే స్ట్రా బెర్రీ తిందామా?"

"ఊ" అంది.

ఐస్‌క్రీం కప్ లత దగ్గరకు నెట్టాడు హేమంత్.

ఐస్‌క్రీం అయిపోయాక లేవబోయిన లతను "అయిదు నిమిషాలు కూర్చుందామా?"

అతడి ముఖంలోకి చూసి "ఊ" అంటూ చెయిర్‌లో వెనకు వాలింది.

"లతా.. నన్నేం ప్రశ్నించకుండా ఒక్క నిముషం కళ్ళు మూసుకోవాలి. ప్లీజ్ చెప్పేవరకు చూడకూడదు" అన్నాడు హేమంత్.

"మరి ఇదే, 'అర్ధంకారు మీరు ' అంటే, ఎందుకో తెలియాలిగా?" అంది.

"ముందే చెప్పాను కదా క్వశ్చన్ చెయ్యకూడదని. తర్వాత చెప్తాను కదా"

"సరే" అంటూ కళ్ళు మూసుకుంది లత.

"చూడకూడదూ.. నో చీటింగ్ లతా" అంటూ పాకెట్‌లోంచి బ్రేస్‌లెట్ తీసి ఆమె ఎడమ చేతికి వేశాడు. ఇబ్బందిగా చెయ్యి వెనక్కు తీసుకోబోయింది లత.

"ఇపుడు చూడొచ్చు" చెయ్యి వదిలేస్తూ అన్నాడు.

కళ్ళు తెరిచి, చేతికున్న బ్రేస్‌లెట్ చూస్తూనే అతడివైపు విస్మయంగా చూసింది.

"ఇది నా చేతికి వేశారేంటి?" అడిగింది.

"యు ఆర్ మై ట్రూ ఫ్రెండ్ లతా" అన్నాడు ఆమె కళ్ళలోకి చూస్తూ.

చటుక్కున చూపును మరల్చుకుంది 'అతడి కళ్లకు మాటలు వచ్చు' అనుకుంటూ తడబడింది లత.

"నేను బుక్స్ అడిగాను హేమంత్" అంది.

"నేను నీ స్నేహం కోరుతున్నాను లతా."

"స్నేహం విలువ పన్నెండు వేలా హేమంత్?"

"అపురూపమైన అనుభూతులకు విలువను కట్టి నా మనసును గాయపరచకు లతా.. ప్లీజ్"

అతడి కళ్ళలో తనపట్ల పెంచుకున్న ఇష్టం ప్రతిబింబిస్తుంది. ఆమె కనురెప్పలు రెపరెపలాడాయి.

ముందెన్నడూ అనుభవంకాని ఒక ఉలికిపాటు ఆమె మనసులో. అతడి మనసులో సౌమ్యమైన మాటల తీరు, మృదువైన ప్రవర్తన లత మనసును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

తన జీవితంలో అమ్మా, నాన్నా తప్ప మరే బంధాలు లేవు. ఇపుడు తన మనసును ఒక స్నేహబంధం అల్లుకుంది. చేతికున్న బ్రేస్‌లెట్‌ను గుండెకు హత్తుకుంది.

బిల్ పే చేసి వచ్చిన హేమంత్ "లతా వెళ్దామా?" అన్నాడు.

ఉలిక్కిపడి చూసింది. నెమ్మదిగా కూర్చున్నాడు హేమంత్.

"లతా.. ఏమైంది? నీ మనసు గాయపరిస్తే క్షమించు" అంటూ.

అలవోకగా అతడి కళ్ళలోకి చూస్తూ, అతడు తన చేతికి వేసిన ముత్యాల బ్రేస్‌లెట్‌ను పెదవులతో స్పృశించింది లత.

"థాంక్యూ మై డియర్ ఫ్రెండ్" అంటూ.

"లై యు మై ఫ్రెండ్" అంటూ నెమ్మదిగా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. ఆమె కళ్ళలోకి చూస్తూ బ్రేస్‌లెట్‌ను పెదవులతో తాకాడు.

ఇద్దరూ కూడా ఒక ఊహించని సంభ్రమానికి లోనయ్యారు. వారి మనసులు  మౌనంగా ఉసులాడుకున్నాయి.

అతడి చేతిలోంచి చేతిని చటుక్కున వెనక్కు తీసుకుంది.

"వెళ్దామా?" అంటూ లేచిన హేమంతుని అనుసరించి వెళ్ళింది మౌనంగా.

బైక్‌ను స్టార్ట్ చేశాడు హేమంత్. హాస్టల్‌కు చేరుకున్న విషయం కూడా ఆమె గమనించలేదు.

"లతా! మూడుసార్లు పిలిచాను"

ఉలికిపడి బైక్ దిగి నిలబడింది.

"ఇవిగో బుక్స్, పట్టుకు చూడు ఎంత బరువున్నాయో?" అంటూ అందించాడు ఆమెకు.

"అమ్మో. నిజంగానే చాలా బరువుగా ఉన్నాయి."

"నేను పైకి మీ రూం వరకు తెచ్చిపెట్టనా?" చిన్నగా నవ్వుతూ అడిగాడు.

"మీకు అనుమతి ఉండదు సార్. ఇది అమ్మాయిల హాస్టల్" అంటూ బుక్స్ పట్టుకుని వెనక్కు తిరిగింది లత.

"లతా, ఒక్క క్షణం" అన్నాడు.

లత చటుక్కున వెనక్కు తిరిగి చూసింది.

చూడగానే సెల్‌లో కెమెరా క్లిక్ చేశాడు హేమంత్.

"హేమంత్ మీతో చాలా కష్టం" అంది చిరుకోపంగా.

"ఇక్కడ కూడా ఒకరు అంటున్నారు. లతను వదిలి వెళ్ళాలంటే చాలా కష్టం అని."

"ఎవరు?"

"నా మనసు" గుండెపై చెయ్యి ఉంచుకుని అన్నాడు హేమంత్.

"మిమ్మల్ని అమాయకులు అనుకున్నాను. నా అంచనా కరెక్ట్ కాదు." అం,ది లత.

"నా అంచనా కరెక్ట్ అని చెప్తుంది నా మనసు."

"ఏంటి మీ అంచనా?" చిరు కోపంగా అడిగింది లత.

"ఈ అమ్మాయి నా స్వంతమేనని "

లత గుండె ఝల్లుమంది. అతడివైపు విస్మయంగా చూస్తూ రెండడుగులు వెనక్కు వేసింది,

"అంతా మీ ఇష్టమేనా?" అంటూ.

"మరి? లత ఇష్టమే నా ఇష్టం కదా" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

"బై అండ్ థాంక్స్ ఫర్ ఎవ్విరి థింగ్" అంటూ వేగంగా వెళ్ళిపోయింది వెనుతిరిగి చూడకుండా.

"ఎవ్విరి థింగ్ అంటే ఏమిటో" అనుకుంటూ బైక్ స్టార్ట్ చేసి ఒకసారి పై బాల్కనీవైపు చూసి వెను తిరిగాడు హేమంత్.

లైట్ వెలుగుకు కళ్ళు తెరిచిన హేమంత్, చేతిని కళ్ళకు అడ్డంగా పెట్టుకున్నాడు. అతడి మనసు గతాన్ని వదిలి వచ్చింది. అరుణ్ నెమ్మదిగా వచ్చి బెడ్‌పై కూర్చున్నాడు.

"హేమంత్, ఏంటిరా ఇది? ఇలా చీకట్లో పడి ఉంటావా?" హేమంత్ చేతిని చేతిలోకి తీసుకుంటూ అన్నాడు అరుణ్. నెమ్మదిగా లేచి కూర్చున్నాడు హేమంత్.

"నా మనసులో అలజడిగా వుందిరా అరుణ్. లతతో కలిసి గడిపిన ప్రతి క్షణం, మాట్లాడుకున్న ప్రతిమాటా, కన్న ప్రతి కలా గుర్తు చేస్తుందిరా మనసు. చాలా బాధగా వుంది. 'అసలేం జరిగింది?' ఇదే ప్రశ్న నన్ను హింసిస్తుందిరా అరుణ్"

ఒక్క క్షణం మౌనంగా ఉండిపోయాడు అరుణ్.

"హేమంత్, ప్రతి పేషెంట్‌కు ఒక నమ్మకం ఉంటుందిరా. ఫలానా డాక్టర్ అయితేనే తనకు నయం అవుతుందని. ఆ నమ్మకమే పాజిటివ్‌గా పనిచేస్తుంది వాళ్ళకు. చాలామంది ఇన్నే అడుగుతున్నారు."

"నువ్వు చెప్పేది కరెక్టే, కాని డాక్టర్ కూడా మనిషే కదరా. మనసులో బాధలూ, కళ్ళలో నీళ్ళూ ఉంటాయిగా" హేమంత్ స్వరంలో ఆవేదన అరుణ్ మనసును కూడా తాకింది.

"అవునులే. కాని నెమ్మదిగా, కేవలం తన కోసమే కాకుండా, తన చుట్టూ ఉన్న వాళ్ళకోసం అయినా ఆ స్థితిలో నుంచి బయటకు రావటానికి ప్రయత్నించాలి, ప్లీజ్‌రా హేమంత్" అరుణ్ కళ్ళు చెమ్మగిల్లాయి. హుషారుగా, ఉల్లాసంగా తిరిగిన హేమంత్ అతడి కళ్ళలో మెదిలాడు.

"ప్రయత్నిస్తున్నానురా. ఏ మెడికల్ సైన్స్ రిపేర్ చెయ్యలేనంతగా గాయపడిందిరా నా మనసు, జీవితం. లత తిరిగి కలిసింది అని సంతోషించాలో, బాధపడాలో తెలియని టెన్షన్ ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. ఏం చెయ్యమంటావ్?"

"అవునురా, తర్వాత మాట్లాడుకుందాం. నేను, విన్సెంట్ సర్ వచ్చారు అని నిన్ను తీసుకువెళ్ళటానికి వచ్చాను. నీ ఫోన్ సైలెంట్‌లో ఉన్నట్టుంది. పద, లే" అన్నాడు అతడి చెయ్యి పట్టుకుని.

"పద వెళ్దాం" అంటూ లేచాడు హేమంత్.

"కొంచెం ఆ క్రాప్ అదీ చూసుకో. షర్ట్ బాగోలేదు" అంటూ అల్మరా తెరిచి ఒక షర్ట్ తీసిచ్చాడు.

తొందరగా షర్ట్ వేసుకుని తల దువ్వుకుని, "ఓకేనా?" అన్నాడు.

"ఇప్పుడు నచ్చావ్. ఓకె పద" అంటూ హేమంత్ భుజాల చుట్టూ చెయ్యివేసి నడిచాడు అరుణ్.

లిఫ్ట్‌లో క్రిందకు దిగిన హేమంత్, అరుణ్‌లు డాక్టర్ విన్‌సెంట్ రూములోకి వెళ్ళారు.

"కమాన్, హేమంత్, రండి కూర్చోండి అరుణ్" అంటూ కుర్చీలు చూపించాడు అతడు.

"హేమంత్, నేను ఇంతకు ముందే లతను చూసాను. ఆమె కంప్లీట్లీ అవుట్ ఆఫ్ డేంజర్. ఎవ్వరి థింగ్ ఈజ్ ఓకె. ఇక వర్రీ అవ్వకు. ఇక నెమ్మదిగా నీ రొటీన్‌లోకి ఎంటర్ అవ్వు. ఒకసారి లతను చూడు, నీకే తెలుస్తుంది."

"థాంక్యూ సర్, తను ఎప్పుడు మెలుకువ.. అదే కాన్షస్‌లోకి వస్తుంది?" అడుగుతున్న హేమంత్ ముఖంలోకి చూశాడు డాక్టర్ విన్‌సెంట్.

"నీకు తెలియదా హేమంత్? వస్తుంది, ఇంకా రాలేదు. నథింగ్ టు వర్రీ. కాని నీకు ముందు జాగ్రత్తగా ఒక విషయం చెప్పాలి" అన్నాడూ డాక్టర్ విన్‌సెంట్.

"చెప్పండి సర్" అన్నాడు లోలోన భయపడుతూ..

"ఇన్నేళ్ళ గ్యాప్ తర్వాత ఒక్కసారిగా ఆమె నిన్ను చూస్తే ఆమె ఉద్వేగానికి లోనవ్వచ్చు. అది కోలుకుంటున్న ఆమె గుండెకు మంచిదికాదు. ఇదంతా నేను నీకు చెప్పక్కర్లేదు అనుకుంటున్నాను. యు నో ప్రెట్టీవెల్. లత కళ్ళు తెరవగానే నువ్వు కనిపించకూడదు. ముందుగా ఆమెను అందుకు ప్రిపేర్ చెయ్యాలి."

"అలాగే సర్. థాంక్యూ" అంటూ లేచి బయటకు నడిచాడు హేమంత్.

"అరుణ్, లతకు ఇక ఫర్వాలేదు. కానీ హేమంత్‌ను కొంచెం ఒంటరిగా వదిలేయకు వీలైనంత వరకు" చెప్పాడు విన్‌సెంట్.

"అలాగే సర్."

"నేను ఆలోచిస్తున్నది తన కోసమో. మనకోసమో కాదు. అతడి వల్ల జీవితాన్ని పొంది బ్రతుకుతున్న అనేకమంది అభాగ్యులకోసం, వాళ్ళందరికీ అతడి అవసరం వుంది. తన తల్లి తండ్రులను కోల్పోయాక, వారు నడిపే అనాధశరణాలయాలు, వృద్ధ ఆశ్రమాలు, ఉచిత విద్య, వైద్యశాలలు, ఇంకా అనేక సేవా కార్యక్రమాలు ఆగిపోకుండా తనభుజాన వేసుకుని నడిపిస్తున్నాడు ముందుకు. లెక్కకు మించి అనాధ పిల్లలను చేరదీసి చదివిస్తూ, వాళ్ళకు భవిష్యత్‌లోకి మార్గాలు ఏర్పరుస్తున్నాడు. ఇట్స్ నాట్ ఎ జోక్ అరుణ్."

"అవును సర్. శూన్యంగా మిగిలిన తన గుండెలో వాళ్ళ ప్రేమను నింపుకుంటున్నాడు. ఇంత హాస్పిటల్‌కు అవుతున్న ఖర్చంతా ప్రతిపైసా తనే భరిస్తూ, చాలామంది పేదలకు ఉచితంగా వైద్యం చేస్తున్న దేవుడు హేమంత్. అంత మంచివాడిని దేవుడెందుకు ఇంతగా శిక్షించాడో అర్ధం కావటంలేదు" అరుణ్ ఉద్వేగానికి గురయ్యాడు.

"సర్, హేమంత్‌ను లత దగ్గరకు తీసుకెళ్ళి మళ్ళీ వస్తాను అంటూ వెళ్ళిపోయాడు అరుణ్.

ఎదురుగా గోడకు ఉన్న ఫోటోలో జీసస్‌ను చూస్తూ డాక్టర్ విన్సెంట్ ప్రార్ధన చేశాడు.

"ఓ గాడ్.. ప్లీజ్ బ్లెస్ హిం" అంటూ."

లాంజ్‌లో వెయిట్ చేస్తున్న హేమంత్ దగ్గరకు వెళ్ళాడు అరుణ్.

"హేమంత్, రా" అంటూ అతడితో కలిసి, పోస్ట్ ఆపరేటివ్ కేర్ యూనిట్‌లో ఉన్న లత బెడ్ దగ్గరకు వెళ్ళాడు అరుణ్.

"ఒక్క క్షణం రా" అంటూ లత చెయ్యి పట్టుకు చూశాడు డాక్టర్ అరుణ్. ఆమె ఇంకా అపస్మారక స్థితిలోనే వుంది. కొంచెం కదిలింది, కాని కళ్ళు తెరవలేదు.

"రా హేమంత్" అన్నాడు తను పక్కకు వెళ్తూ.

నెమ్మదిగా ఆమె దగ్గరగా వెళ్ళాడు హేమంత్.

"లతా" అంటూ ఆమె నుదుటిపై చెయ్యివేశాడతడు. అతడి గుండె చప్పుడు అతడికే వినిపిస్తున్న ఫీలింగ్. ఆమె తలను నిమిరాడు అతడు, బాధను దిగమింగుతూ.

ఆమె కనురెప్పలు కొంచెం కదిలాయి. ఆ కదలికలో అతడి మనసులో గతపు జ్ఞాపకం ఒకటి కదలాడింది.

తన ఒడిలో తలపెట్టుకు పడుకున్న హేమంత్‌ను "హేమ్, నాకేమైనా అయితే ఏం చేస్తావ్?" అడిగింది లత. సముద్ర కెరటాలు వాళ్ళ పాదాలను తాకి వెళ్తున్నాయి.

"మరి నాకేమైనా అయితే నువ్వేం చేస్తావ్?" అడిగాడు హేమంత్ ఆమె ముఖంలోకి చూస్తూ.

"నో!" అంటూ అతడి పెదవులపై చేతిని పెట్టింది ఆమె.

ముందుకు వాలి అతడి నుదుటిపై తన ముఖాన్ని ఆన్చి, "నువ్వు లేక ఈ లత లేదు హేమ్. ప్రాణాలతో ఉండదు."

"మరి ఇక్కడా సేమ్ అదే ఫీలింగ్ అమ్మా" అప్రయత్నంగా ఆ మాటలు అతడి నోటివెంట వచ్చేసాయి మనసును దాటి.

మానిటర్‌ను గమనిస్తున్న అరుణ్ ఉలిక్కిపడి వెను తిరిగి హేమంత్ వైపు చూశాడు. అక్కడే ఇంజెక్షన్ లోడ్ చేస్తున్న సిస్టర్ కూడా అతడి ముఖంలోకి విస్మయంగా చూసింది.

"హేమంత్, ఏంటిరా?" అంటూ అతడికి దగ్గరగా వెళ్ళాడు అరుణ్.

"నే లేకపోతే నువ్వేం చేస్తావ్? అని అడుగుతుందా నన్ను?"

"ఎపుడురా? కూల్ డౌన్‌రా" అన్నాడు నెమ్మదిగా.

హేమంత్, లత నుదుటిపై ఉన్న తన చేతిని చటుక్కున వెనక్కు తీసుకున్నాడు.

"నీకేం కాదు లతా, నేను ఉన్నానుగా" అని వేగంగా డోర్ తీసుకు వెళ్ళిపోయాడతడు. భారంగా నిట్టూర్చాడు అరుణ్. సిస్టర్‌కు ఏమో చెప్పి, వేగంగా హేమంత్‌ను అనుసరించి వెళ్ళాడు అతడు.

అప్పటికే లిఫ్ట్‌లోకి ఎక్కిన హేమంత్‌ను చూస్తూనే పరుగున వెళ్ళి, మూసుకుంటున్న లిఫ్ట్ డోర్స్ మధ్య చెయ్యి పెట్టాడు  అరుణ్. లిఫ్ట్ ఆగటంతో అతడూ ఎక్కి మౌనంగా నిలబడ్డాడు.

రూములోకి వెళ్ళాక ఫ్రిజ్‌లో వాటర్ బాటిల్ ఒకటి తీసి హేమంత్‌కు ఇచ్చాడు అరుణ్. అతడు కొంచెం తాగాక ఆ బాటిల్ అందుకుని తను తాగి, సోఫాలో కూర్చుంటూ భారంగా నిట్టూర్చాడతడు .హేమంత్ ముఖంలోకి చూశాడు.

"ఏమైంది? అలా చూస్తున్నావ్, ఇపుడు ఏం జరిగిందని?" అడిగాడు హేమంత్.

"ఏం లేదురా హేమంత్, ఇన్నాళ్ళకు లత మళ్ళీ నీ దగ్గరకు చేరిందని చాలా సంతోషంగా వుంది నాకు. తను కొద్ది రోజుల్లో ఎప్పటిలా మనిషి అవుతుంది. అందుకు హాయిగా వుండాలిగాని ఇలా దిగులుగా నీలో నువ్వు బాధపడిపోతుంటే నాకు బాగోలేదురా." అరుణ్ మాటలకు పేలవంగా నవ్వాడు హేమంత్.

"ఇది మనసు కదురా, మన అదుపులో ఉండదు, మన మాట వినదు. పాదరసంలా దొర్లుకుంటూ వెళ్ళి, గతం తలుపులను తట్టి ప్రతి క్షణాన్ని, ప్రతి సంఘటననూ తెచ్చి కళ్ళముందు పెడుతుంది. మరచిపోవటం నావల్ల కావటంలేదు. ఏ ఆలోచనా రాకుండా, ఏ ఆవేదనా తెలియకుండా ఆదమరచి నిద్రపోవాలని వుందిరా,  అరుణ్."

దగ్గరగా వెళ్ళి హేమంత్ భుజాల చుట్టూ చేతులు వేసి దగ్గరకు తీసుకున్నాడు అరుణ్. ఒక్కసారిగా హేమంత్ అతడి గుండెలో తలదాచుకున్నాడు. దుఃఖిస్తున్న హేమంత్‌ను మరింతగా గుండెకు హత్తుకున్న అరుణ్ కళ్ళు చెమ్మగిల్లాయి.

"హేమంత్, జీవితాన్ని సుడిగాలిలా కబళించి దోచుకుపోయిన గతాన్ని మరచిపోదాం రా ప్లీజ్. నువ్వు అనుభవించిన నరకం నాకూ తెలుసు కదరా. కొద్ది గంటలలో లత కళ్ళు తెరుస్తుంది. నిన్ను చూస్తుంది. ఆ క్షణం కోసం ఆనందంగా ఎదురు చూద్దాం" అతడి వీపుపై చిన్నగా తడుతూ చెప్పాడు అరుణ్.

"లత లేస్తూనే నాకోసం అడుగుతుందిరా. ఏం చెప్తావ్? ఇంతకాలం తనని మరచి బ్రతికేస్తున్న దుర్మార్గుడు ఇక్కడే వున్నాడని చెప్తావా? నాకోసం ఎంత తల్లడిల్లిందో పాపం. తన ఫోను ఎన్నిసార్లు చేసినా పలుకదు. ఆ స్థితిలో నేను అనుభవించిన నరకం ఎవరికీ అనుభవం కాకూడదురా, అంత భయంకరం. నేను కదలలేని స్థితిలో వుండిపోయి నిన్ను పంపించాను లత దగ్గరకు. నువ్వు తెచ్చిన వార్త వినగానే నిలువునా చచ్చిపోయానురా. చనిపోవాలనిపించింది. దానికీ అడ్డు నిలిచావు. ఇది.. చాలా అన్యాయంరా అరుణ్. దెబ్బమీద దెబ్బ కొట్టి ఆనందిచేవాడు దేవుడెలా అవుతాడురా?"

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS